క్లుప్తంగా

శాకంబరి దేవిగా దర్శనమిచ్చిన సత్యమ్మ అమ్మవారు



నందిగామ: మండల పరిధిలోని అంబారుపేట గ్రామంలో ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారు సోమవారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దాదాపు నాలుగు క్వింటాళ్ల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు.ఈ రూపంలో రెండు రోజులపాటు అమ్మవారు దర్శనమిస్తారు. బుధవారం అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో తయారుచేసే వంటకాలతో అన్న ప్రసాద వితరణ గావించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. శాకంబరి రూపంలో ఉన్న సత్యమ్మ అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

రైతుబజార్‌లో రాయితీపై టమాట సరఫరా



జగ్గయ్యపేటఅర్బన్: టమాటా ధరలు పెరిగిన నేపథ్యంలో వినియోగదారులకు ఊరట కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై కిలో రూ.50కు విక్రయిస్తున్న టమాలను సోమవారం స్థానిక రైతు బజారులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పంపిణీ చేశారు. ఈ సౌకర్యాన్ని వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ తన్నీరు నాగమణి నాగేంద్ర, ఈవో వెంకటరమణ పాల్గొన్నారు.

రూ.50కే టమాటా విక్రయాలు

కంచికచర్ల: బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు విపరీతంగా పెరగటంతో ప్రభుత్వం టమాటను సబ్సిడీపై ప్రజలకు అందజేస్తోందని రైతుబజార్ ఎస్టేట్ అధికారి అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక రైతుబజార్‌లో సోమవారం సబ్సిడీపై టమాటను ప్రజలకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా ధర రూ.100 నుంచి రూ.150కు పైగా ఉండగా ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా ప్రజలకు రాయితీపై కిలో రూ.50కే సరఫరా చేస్తోందన్నారు. రైతు బజార్‌లో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి స్వయం సహాయక సంఘ సభ్యుల ద్వారా టమాటను అందజేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పురుగుమందుల దుకాణాల తనిఖీ



జగ్గయ్యపేట: పట్టణంలోని పురుగుమందుల దుకాణాలలో నందిగామ ఏడీఏ శ్రీనివాస్ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. శ్రీ వెంకటేశ్వర, సాయి వెంకట రమణ ఫెర్టిలైజర్స్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. రైతులకు విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎప్పటికప్పుడు రికార్డులు నమోదు చేయాలని సూచించారు. వినియోగదారులకు విక్రయ రశీదులు ఇవ్వాలన్నారు. పత్తి, మిర్చి విత్తనాల కృత్రిమ కొరత సృష్టించటం, నకిలీ విత్తనాలు విక్రయించినా సహించేది లేదన్నారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయం నుంచి కనకదుర్గమ్మకు సారె

పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయం నుంచి సోమవారం విజయవాడలో కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మ వారికి సారె సమర్పించారు. ఆలయం వద్ద నుంచి ఉదయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో మహిళలు, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు విజయవాడ వెళ్లి అమ్మవారికి సారె సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

వీరులపాడు: నర్సరీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నర్సరీలను ఏర్పాటు చేయాలని మండల ఉద్యాన శాఖాధికారి నీలిమ అన్నారు. మండలంలోని జుజ్జూరు, అల్లూరు, చౌటపల్లి, వెల్లంకి గ్రామాల్లోని నర్సరీలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీల చుట్టూ షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని, వాటికి మూడు అడుగుల దూరంలో కలుపు మొక్కలు ఉండకూడదన్నారు. నారు పెంచేందుకు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సచివాలయాలతో ప్రజల ముంగిటకు పాలన

జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు



చందర్లపాడు-2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆర్డీఓ

నందిగామ టౌన్(చందర్లపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు పాలన తీసుకువచ్చారని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. చందర్లపాడు-2 సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలను చేజారకుండా చూసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. గతంలో విద్యార్థులు సర్టిఫికెట్‌లు తీసుకోవాలంటే ఉదయం నుంచి సాయంత్రం దాకా రోజుల తరబడి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం గ్రామంలోనే సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని రకాల సర్టిఫికెట్‌లను ప్రభుత్వం సులభతరంగా అందిస్తోందని తెలిపారు. చందర్లపాడు మండలంలో ఆయా సమస్యలపై ప్రజలు 408 అర్జీలు దాఖలు చేయగా వాటిలో 347 అర్జీలను వెంటనే పరిష్కరించి సర్టిఫికెట్‌లు అందజేసినట్లు తెలిపారు. మరణ ధ్రువీకరణ పత్రాలను కూడా త్వరితగతిన జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. చందర్లపాడు మండలంలో గత వ్యవసాయ సీజన్‌లో పంట నష్టం జరిగిన పత్తి, మిర్చి రైతులకు పంట నష్టపరిహారం కింద ఎకరాకు రూ.900 మాత్రమే ఇచ్చారని రైతులు ఫిర్యాదు చేయగా విషయాన్ని సమీక్షించి తగు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

ప్రభుత్వ సేవలకు నిదర్శనం : ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలకు నిదర్శనమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వాధికారులే ప్రజల ఇళ్ల ముంగిటకు వచ్చి ప్రజావసరాలను తెలుసుకుని కావాల్సిన అన్ని రకాల సర్టిఫికెట్‌లను అందిస్తున్నారని చెప్పారు.

ఇంటి ముంగిటకే పథకాలు : ఎమ్మెల్సీ

గత ప్రభుత్వంలో ఏ రకమైన సర్టిఫికెట్ కావాలన్నా, సంక్షేమ పథకాలు పొందాలన్నా జన్మభూమి కమిటీలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉంటే ప్రభుత్వ పథకాలు ఇళ్ల ముంగిటకే వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ సుశీలాదేవి, ఎంపీడీవో జ్యోతి, సర్పంచ్ కస్తాల పున్నమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, బుగ్గినేని సురేష్ , అధికారులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందని వారిని గుర్తించి పథకాలు అందించటమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. మండలంలోని ముప్పాళ్ల-1 గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారుపల్లి కపిల్, నల్లాని అయ్యన్న, నల్లాని సాయి, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా గ్రామాలు

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



దాచవరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

దాచవరం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి చిరునామాగా నిలుస్తున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని దాచవరం గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు, రైతులు, మహిళలతో పాటు అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్నారన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రత్న ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు అయిలూరి వెంకట్రావమ్మ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలి

జమ్మవరం(వీరులపాడు): ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య అన్నారు. మండలంలోని జమ్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని వినతి

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారికి చెందిన స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని బీజేపీ నాయకులు సోమవారం ఆలయ ఈవో సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని చందర్లపాడు బస్టాండ్ వద్ద లీజుదారుడు నిబంధనలకు విరుద్ధంగా శాశ్వత నిర్మాణం చేస్తున్నారని, వాటిని వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేదార్‌నాథ్ శర్మ డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి పవిత్రోత్సవాలలో భాగంగా మూడవ రోజు సోమవారం అర్చకులు స్వామివారికి విశేష పూజలు చేశారు. అష్టకలశారాధన, అభిషేకాలు, వామనోత్సవం తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు వేదాంతం వెంకట శేషాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతిఏటా స్వామి వారికి లోక కల్యాణార్థం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో హేమలతాదేవి, కేసీపీ ప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల బీమా సొమ్ము జమ



ప్రభుత్వ విప్ ఉదయభానును కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న వెంకటేష్ కుటుంబ సభ్యులు

జగ్గయ్యపేటఅర్బన్: పేదలకు సంక్షేమ పథకాలను అందించే క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గటం లేదని, వైఎస్సార్ బీమా విషయంలో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు.

పట్టణంలోని 13 వ వార్డు రజక బజారుకు చెందిన తుమ్మడపు వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.5 లక్షల బీమా సొమ్ము సోమవారం మృతుని కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. ఈ సందర్భంగా వెంకటేష్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఉదయభానును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ వెంకటేష్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో 13 వ వార్డు నాయకులు గొల్లపూడి ముక్తేశ్వరరావు, సిద్దేపల్లి శ్రీను, షేక్ సైదులు, యడవల్లి సతీష్, గొల్లపూడి గోపాలకృష్ణ, నక్కా పవన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పేటలో అనధికార నిర్మాణాలు, లేఅవుట్లపై చర్యలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో అనధికార కట్టడాలు, లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ తన చాంబర్‌లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ప్లాట్లు కొనుగోలు చేసేవారు ఎల్పీ నంబర్లు, సీఆర్‌డీఏ వారి అనుమతి ఉన్నదీ లేనిది చూసి కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాల్సిందిగా సబ్ రిజిస్ట్రార్ కు లేఖ పంపాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

మైనర్ బాలుడి అదృశ్యం

కంచికచర్ల: ఓ మైనర్ బాలుడు అదృశ్యమైన సంఘటన మండలంలో సోమవారం జరిగింది. ఎస్ఐ పీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన పల్లపు సురేష్(16) పదవ తరగతి చదివాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవటంతో కంచికచర్లలో ఏసీ మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. అయితే ఈనెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవటంతో కుటుంబసభ్యులు, బంధువులను విచారించారు. కాని అతని జాడ తెలియకపోవటంతో తండ్రి ఏసుబాబు సోమవారం కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుబజార్‌లో రాయితీపై టమాటాల విక్రయం

నందిగామ: పట్టణంలోని రైతుబజార్‌లో సోమవారం రాయితీ ధరపై కిలో రూ.50కు టమాటాల విక్రయాన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు నల్లమల్లి మురళి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల విక్రయం

మండలంలోని మాగల్లు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం రాయితీపై వరి విత్తనాల విక్రయాన్ని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కామినేని రవి శంకర్ ప్రారంభించారు. కేజీకి 5 రూపాయల రాయితీపై వరి విత్తనాలను విక్రయిస్తున్నామని ఏవో ఖాసిం తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమాలు

జగ్గయ్యపేటఅర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం పట్టణంలో మంగళవారం రెండు సచివాలయాల్లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆర్టీసీ కాలనీలోని ఈశ్వరరావు హోటల్ ఎదురు లైన్‌లో ఉన్న 2 వ సచివాలయంలో, నాగమయ్య బజారులోని సీఆర్పీ భవన్‌లో ఉన్న 10 వ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపులు జరుగుతాయని తెలిపారు.

నందిగామలో...

నందిగామ: పట్టణ పరిధిలోని రెండవ సచివాలయం వద్ద మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రామిరెడ్డిపల్లిలో సచివాలయం వద్ద, అంబారుపేటలోని సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: మండలంలోని పెనుగంచిప్రోలు-1, అనిగండ్లపాడు-1 సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గండేపల్లి, కునికెనపాడు గ్రామాల్లో...

కంచికచర్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని గండేపల్లి, కునికెనపాడు గ్రామాల్లో మంగళవారం జరుగనుందని ఎంపీడీఓ కె.బాలశంకరరావు సోమవారం తెలిపారు. మండలస్థాయి అధికారులు రెండు గ్రామాల్లో ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించి, అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హాజరుకానున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నందిగామ: పట్టణంలోని 12వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

తాగునీటి అవసరాలకు ట్యాంకర్లను వినియోగించుకోండి

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): నియోజకవర్గంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని నిధుల నుంచి గ్రామాలకు వచ్చిన తాగునీటి ట్యాంకులను పంచాయతీ సిబ్బంది వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామానికి వచ్చిన తాగునీటి ట్యాంకర్‌ను ఆయన సోమవారం పంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రెండు నెలల క్రితం తాను ఎంపీ కేశినేనిని ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరగా, తక్షణమే స్పందించి నియోజకవర్గానికి 28 ట్యాంకులను అందించారని తెలిపారు. వాటర్ ట్యాంకులు అందించిన కేశినేనికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చలమల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సతీష్, శ్రీనివాస్ గౌడ్, కమలేష్, నరసింహారావు, నాగరాజు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

నందిగామ: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. కృష్ణాజిల్లా గుడివాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులుపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేసినందుకు నిరసనగా విధులు బహిష్కరించి నిరసన తెలిపినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చరిత్ర ఎరుగని సంక్షేమ పాలన

వెల్లంకిలో సచివాలయ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే



గ్రామ సచివాలయ భవనానికి స్థల దాతలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వెల్లంకి(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను రూపొందించి చరిత్ర ఎరుగని సంక్షేమ పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయాలతో ప్రజలకు అవసరమైన అన్ని సేవలను గ్రామంలోనే అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో సచివాలయాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, సిమెంట్ రోడ్లు, డ్రైన్‌లతో పాట పలు అభివృద్ధి పనులు చేపడుతూ గ్రామాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అనంతరం గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలు అప్పన పుల్లయ్య, సీతారావమ్మ దంపతులతో పాటు వారి కుమారులు సాంబశివరావు, కృష్ణ, ఆంజనేయులును ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- షిరిడీ సాయి నాథునికి ప్రత్యేక పూజలు, విశేష హారతులు
- పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు



పట్టణంలోని సాయి అయ్యప్ప ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా గురు పౌర్ణమిని సోమవారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఇందులో భాగంగా స్థానిక రామలింగేశ్వర నగర్‌లో గల సాయి అయ్యప్ప ఆలయంలోని సాయిబాబాకు విశేష పూజలు నిర్వహించారు. పలు సంధ్యలలో ప్రత్యేక హారతులు, పల్లకి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్ పాల్గొన్నారు. స్థానిక చెరువు బజారులోని షిరిడీ సాయి ఆలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని బాబాకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని మహిమ సాయి ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా భజన సంకీర్తన, అనంతరం అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. స్థానిక రామలింగేశ్వర నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో గల షిరిడీ సాయిబాబా ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు, ప్రత్యేక హారతులు నిర్వహించారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని పలు సాయిబాబా ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వారికి విశేష పూజలుచేశారు. కంచికచర్ల మోడల్‌కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో భక్తులు నీరాజన మంత్ర పుష్పములు, మహన్యాసపూర్వక అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని గురువులను స్మరించటం వల్ల త్రిమూర్తులను పూజించిన పుణ్యఫలం లభిస్తుందని ఆలయ అర్చకులు తారక్‌బాబు అన్నారు. మండలంలోని పరిటాల సాయిబాబా ఆలయంలో అర్చకులు ఏకాంబరేశ్వర శర్మ స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం 5 వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. మండలంలోని గండేపల్లి, కునికెనపాడు, గొట్టుముక్కల, మోగులూరు, చెవిటికల్లు, కొత్తపేట గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన చేశారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: గురుపౌర్ణమి వేడుకలను సోమవారం మండలంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక చెరువు కట్ట వద్ద, కాజ్‌వే వద్ద ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా వారి ఆలయాల్లో స్వామి వారికి పంచామృతాలు, పవిత్ర జలాలతో, అన్నాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కొణకంచిలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గురుస్థానాన్ని గౌరవించటమే గురుపౌర్ణమి

పెనుగంచిప్రోలు: సమాజంలో గురుస్థానాన్ని గౌరవించటానికి గురుపౌర్ణమి జరుపుకొంటున్నామని మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ కళాశాల అధ్యాపకుడు నందనవనం వెంకటకృష్ణారావు అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం స్థానిక కేపీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో వివిధ నైపుణ్యాలపై ప్రసంగించారు. ఇంగ్లీషు, తెలుగు, గణిత గేయాలతో విద్యార్థులకు వివిధ ప్రక్రియలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.జలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలుసుపాడు గురుధాం ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలు

బలుసుపాడు(జగ్గయ్యపేట):గ్రామంలోని గురుధాం ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు శివానందమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



డ్రైన్‌లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ ఉదయభాను

జయంతిపురం(జగ్గయ్యపేట): ప్రభుత్వం గిరిజన తండాలను ఎంతో అభివృద్ధి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్‌ల పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తండాల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో తండాలను పూర్తిగా నిర్వీర్యం చేసి మౌలిక వసతులు కల్పించకుండా కాలయాపన చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఈ నాలుగేళ్లలో గ్రామంలో రూ.9.75 కోట్లను సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించారన్నారు. గ్రామానికి చెందిన బాణావత్ సోమ్లి అనే మహిళ గ్రామంలో సంక్షేమ పథకాలు రాలేదని, డ్రైన్‌లు, రోడ్లు కావాలంటూ ఉదయభానుకు విన్నవించగా వెంటనే స్పందించిన ఆయన వలంటీర్‌ను పిలిపించి వివరాలు అడిగారు. గత నాలుగేళ్లలో ఆమె కుటుంబానికి అన్ని పథకాలు వచ్చాయని వలంటీర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లాహోరు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, ఎస్టీ సెల్ కన్వీనర్ పాండు నాయక్, నాయకులు రోజారావు, నారికేళ నాగభూషణం, బద్యా నాయక్, చల్లా వైకుంఠరావు, నాగరాజు, శ్రీను, స్వామి, గురవయ్య, పీఆర్ ఏఈ శ్రీనివాస్, కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం ప్రారంభం



నందిగామ టౌన్(చందర్లపాడు): ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కలెక్టర్ ఢిల్లీరావు, శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన నూతన 108 వాహనాన్ని చందర్లపాడులో సోమవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్ర, సర్పంచ్ కస్తాల పున్నమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో పూజలు

నందిగామ: పట్టణ శివారు పల్లగిరిగుట్టపై గల త్రిశక్తి పీఠంలో ఆషాఢ పౌర్ణమి నేపథ్యంలో సోమవారం విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకుడు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలోని కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.